క్లుప్తంగా

రామలింగేశ్వర స్వామికి వెండి కవచం సమర్పణ



స్వామికి వెండి కవచాన్ని సమర్పిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలోని బైనేరు శివాలయం శ్రీ ఉమా సహిత రామలింగేశ్వర స్వామికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత వై.రాజేష్, మాధురి దంపతులు వెండి కవచాన్ని అందజేశారు. ముందుగా కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి అలంకరణ నిమిత్తం తీసుకువచ్చిన 4.390 కేజీల వెండి కవచాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాత రాజేష్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని అక్కంపేటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

రోడ్డు ఆక్రమణలపై సర్వే

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డులో ఆక్రమణలపై సోమవారం మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. గతంలో మండల సర్వేయర్‌తో మొదట విడతగా సర్వే చేశారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు తుది నివేదిక ఇచ్చేందుకు సోమవారం కూడా పూర్తిస్థాయిలో సమగ్రంగా శ్రీనివాసపురం రోడ్డులో ఉన్న ఆక్రమణలపై టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీష్ నేతృత్వంలో సిబ్బంది సర్వే చేశారు. ఎక్కడెక్కడ ఎంత మేర రోడ్డు ఆక్రమణకు గురైందనేది గుర్తిస్తున్నట్లు టీపీవో తెలిపారు. సర్వే అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని అనంతరం ఆయన ఆదేశాల మేరకు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

టి.నరసాపురం : సమగ్ర భూ రీ సర్వే ద్వారా దీర్ఘకాలిక భూ సమస్యలకు చెక్‌పెట్టవచ్చని డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రాధాకృష్ణ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు పథకంపై సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూమికి సంబంధించిన రికార్డులు అధికారులకు చూపించి భూమి రీసర్వే చేయించుకోవాలన్నారు. బొర్రంపాలెం గ్రామ పరిధిలో 4,242 ఎకరాల భూమిని రీసర్వే కోసం రికార్డులు పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

వారిని ఎస్టీ జాబితాలో చేర్చవద్దు



ఆర్డీవో కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

జంగారెడ్డిగూడెం : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరుతూ ఆదివాసీ జేఏసీ, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కె.రాఘవ, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వి.భారతి, ఆదివాసీ జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, టి.లక్ష్మణరావు, టి.శ్రీనివాసరావు, ఎం.రామారావు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి

టి.నరసాపురం : శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రంగనాథ శర్మ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు 32 సంవత్సరాలలో భారతదేశం మొత్తం కాలినడకన తిరుగుతూ నలుదిక్కులా నాలుగు పీఠాలను ఏర్పాటు చేసి 72 మతాలను ఏకతాటి పైకి తీసుకువచ్చారని కొనియాడారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

కొయ్యలగూడెం : ప్రజా ప్రయోజనాలను విస్మరించి పాలన సాగిస్తున్న ప్రజా ద్రోహి మోదీని తరిమికొట్టాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద సీపీఐ, సీపీఎం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలందరికీ దుర్భరంగా మారిన కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి సీపీఐ, సీపీఎం పోరాటాలకు ఐక్యంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో మెరుగైన పాలనకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



ద్వారకాతిరుమలలో పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులను అందజేస్తున్న ఎంపీపీ మోహిని, ఎంపీడీవో సుబ్బరాయన్



కామవరపుకోటలో ఉత్తమ సర్పంచులను సత్కరించిన ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమ రమేష్

బుట్టాయగూడెం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన పాలన అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు దగ్గరగా పాలన ఉండాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారని తెలిపారు. వలంటీరు వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత పేదలు ఆర్థికంగా ఎదగాలని నవరత్న పథకాలు పెట్టి ప్రతి ఇంటికీ పథకాలు చేరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. అవినీతి, సిఫార్సులకు తావు లేకుండా లక్షలాది రూపాయలు నేరుగా అర్హులైన పేదల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నారని చెప్పారు. సర్పంచ్‌లు, కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 9 అంశాలను బడ్జెట్లో ప్రాధాన్యతను బట్టి ఖర్చు చేస్తుంటే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అనంతరం వివిధ అంశాలలో కృషి చేసిన 21 మంది సర్పంచ్‌లను ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీహరి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్ రావు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి రత్నాజీ రావు, ఆరేటి సత్యనారాయణ సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. 9 రకాల అంశాల్లో ఉత్తమ సేవలందిస్తూ ఎంపిక కాబడిన 20 పంచాయతీల సర్పంచ్‌లకు సర్టిఫికెట్లను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు శేషవస్త్రాలు కప్పి సత్కరించారు. జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో అభివృద్ధి, సుపరిపాలన అందించేలా ముందుకు సాగాలన్నారు.

సర్పంచ్‌లకు సత్కారం

లింగపాలెం : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ వడ్లాని హరినాథరాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్ సర్పంచ్‌లను సత్కరించి వారి సేవలను కొనియాడారు. 9 రకాల అంశాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంసా పత్రాలను సర్పంచ్‌లకు అందజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ హరినాథరాజు ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత

పోలవరం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించిన సర్పంచ్‌లు, సెక్రటరీలను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు సన్మానించారు. ప్రశంసాపత్రాలను కూడా అందజేశారు. పంచాయతీల్లో సమస్యలను పరిష్కారానికి మరింత కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిడియం సింగరాజు, ఈవోపీఆర్డీ నిఖిల్ మధు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ శ్రీలక్ష్మికి సత్కారం

కొయ్యలగూడెం : పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవం సోమవారం రాజవరం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఆధ్వర్యంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిని సత్కరించారు. ప్రభుత్వ శాఖలను గుర్తించడం అందుకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించడం ఆయా శాఖలలోని ఉద్యోగులలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని జెడ్పీటీసీ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సచివాలయ కన్వీనర్‌లు విస్సుబాబు, ఈడుపుగంటి తాతారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగస్తులు, వలంటీర్‌లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, భీమడోలు వెంకట్రావు, భీమడోలు దుర్గారావు, అందుగుల భీమరాజు, గుదే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ నాయకత్వంలో పల్లెల అభివృద్ధి

చింతలపూడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని మండల పరిషత్ అధ్యక్షుడు డా.బి.రాంబాబు నాయక్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవార్డులు సాధించిన సర్పంచ్‌లు, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీలు 9 విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకున్నాయి. చింతంపల్లి గ్రామ పంచాయతీ 4 విభాగాల్లో అవార్డులు సొంతం చేసుకుంది. మల్లాయగూడెం పంచాయతీ మూడు విభాగాల్లో గణిజర్ల, రేచర్ల, యర్రంపల్లి పంచాయతీలు రెండేసి విభాగాల్లో, యండపల్లి, ఊట సముద్రం, ప్రగడవరం, శివపురం, పోతునూరు, రాఘవాపురం, యర్రగుంటపల్లి, సీతానగరం, లింగగూడెం, తిమ్మిరెడ్డిపల్లి, వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, ఉర్లగూడెం, నామవరం పంచాయతీలు ఒకొక్క విభాగంలో అవార్డులు సాధించాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పల్లె ప్రాంతాల అభివృద్ధి సాధించిననాడే గ్రామ స్వరాజ్యం సాధించినట్లు అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మణికుమారి, ఈఓపీఆర్డీ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కామవరపుకోట : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన రామన్నపాలెం, సాగిపాడు, పోలసీగూడెం, ఆడమిల్లి, తాడిచర్ల గ్రామాల సర్పంచ్‌లను ఉత్తమ సర్పంచులుగా గుర్తించి సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శ్రీదేవి, ఈఓపీఆర్డీ ఈ.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజా, సర్పంచ్‌లు కరిపోతు అనూష, గుండుగొలు సుబ్బారావు, దేవరపల్లి రామమోహన్‌రావు, రాయంకుల తులసి, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ వల్లనే దేశాభివృద్ధి

వేలేరుపాడు : పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే దేశాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడి ఎంఈఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సభలో ప్రసంగించారు. అనంతరం 9 రకాల అవార్డుల పత్రాలను పంచాయతీరాజ్ సిబ్బందికి అందించారు. జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, సోడే వెంకమ్మ, పిట్టా ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎండీ షౌకత్‌హుస్సేన్, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో వివిధ కేటగిరీలలో నిర్వహించిన సేవలకు గాను ప్రభుత్వం తరఫున తొమ్మిది కేటగిరీలలో ఒక్కో కేటగిరీకి మూడు చొప్పున 27 అవార్డులు పొందడం జరిగిందని ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావుల ఆధ్వర్యంలో సర్పంచ్‌లను సత్కరించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ద్వారకాతిరుమల : సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ బొండాడ మోహిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన సీహెచ్ పోతేపల్లి, దొరసానిపాడు, పి.కన్నాపురం పంచాయతీల సర్పంచ్‌లు పోల్కంపల్లి అనీల్ బాబు, లక్కాబత్తుల సిద్ధిరాజు, దాసరి సుబ్బలక్ష్మిలకు, ఆయా పంచాయతీల కార్యదర్శులు కృష్ణ, రామలక్ష్మి, సప్తగిరిలకు ఎంపీపీ మోహిని, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ అవార్డులను అందించారు. ద్వారకాతిరుమలకు సంబంధించిన అవార్డును సర్పంచ్ కుంటం స్వర్ణలత, కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావులకు, గొల్లగూడెంకు సంబంధించిన అవార్డును సర్పంచ్ బొండాడ నాగభూషణం, కార్యదర్శి రాజేష్‌లకు, ఐఎస్.రాఘవాపురం పంచాయతీ అవార్డును సర్పంచ్ దాకారపు బంగారమ్మ, కార్యదర్శి గౌతమిలకు, వేంపాడుకు సంబంధించిన అవార్డును సర్పంచ్ చవల రమేష్, కార్యదర్శి షబ్బీర్‌లకు అందజేశారు.

పంచాయతీరాజ్ దినోత్సవం బహిష్కరణ

కుకునూరు : కుకునూరు పంచాయతీ వద్ద నిర్వహించాల్సిన పంచాయతీ రాజ్ దినోత్సవం కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు బహిష్కరించారు. ఎస్‌డీజీ 9 విభాగాలకు సంబంధించి కేంద్ర పోల్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారం మండలంలోని 15 పంచాయతీల పరిధిలో 5 పంచాయతీలకు ప్రశంసా పత్రాలను ప్రకటించారు. కాగా ఇతర పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు ఆయా విభాగాలకు సంబంధించి సరైన అభివృద్ధి ఉన్న తమ పంచాయతీల పేర్లు రాకపోవడాన్ని నిరసిస్తూ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం పాల్గొన్నారు.

యాదవ సంఘ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక



చింతలపూడి నియోజకవర్గ నూతన కమిటీ

జంగారెడ్డిగూడెం : అఖిల భారతీయ యాదవ మహాసభ చింతలపూడి నియోజకవర్గ నూతన కమిటీని సోమవారం ఏలూరు జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో చింతలపూడి నియోజకర్గం గౌరవ అధ్యక్షుడిగా రాచగొర్ల అచ్యుతరామయ్య యాదవ్, అధ్యక్షుడిగా మిండా వెంకట నాగేశ్వరరావు(చిన్ని), జంగారెడ్డిగూడెం టౌన్ గౌరవ అధ్యక్షుడిగా మనికల బ్రహ్మానందం, అధ్యక్షుడిగా నిలపాల అనిల్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా చిన్ని వీరబాబు, తెల్లగొర్ల సోమరాజు, జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడిగా వీర్ల విజయ్, ఉపాధ్యక్షులగా గురజాల అంజి, మండల యూత్ అధ్యక్షుడిగా స్వార్ల రాజేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా వెలగల తేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కుసురి గోపాలకృష్ణ మాట్లాడుతూ త్వరలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సాయిల స్వాతి, ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారపు బుజ్జి, జిల్లా ఉపాధ్యక్షులు నెట్రు గణేష్ యాదవ్ యాదవ సోదరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



కొయ్యలగూడెంలో సంక్షేమ లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం చొప్పరామన్నగూడెం గ్రామంలో ఎంపీటీసీ చిరవూరి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాదయాత్రను చూసి లోకేష్ బాబు పాదయాత్ర ప్రారంభించాడనీ, అదేవిధంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని కాపీ చేస్తూ ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రజలలోకి వెళ్లాలని పథకాలు రూపొందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పులిని చూసి నక్క వాత పెట్టుకోవడం అంటే ఇదే అంటూ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారని బాలరాజు ఆక్షేపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చి సీఎం వైఎస్ జగన్ ప్రజల ముందుకు వెళుతున్నామని, మరి చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో కరువును చూసి, పలుచోట్ల జరిగిన మారణకాండను చూసో, లక్షలకోట్ల రూపాయల అవినీతి చూసో ఓట్లేయ్యాలా అంటూ ప్రజలు నిలదీస్తుండడం టీడీపీ దుస్థితికి అద్దం పడుతుందన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గ్రామస్తులు ఇళ్ల స్థలాల గురించి, కాలనీల గురించి ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించగా అధికారులను పిలిచి ఎక్కడికక్కడే సమస్యకు పరిష్కార మార్గాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, గ్రామ కన్వీనర్లు చీమకుర్తి సత్యనారాయణ, వేముల సత్యనారాయణ, తగరం ఆశీర్వాదం, బి.ప్రేమ్‌కుమార్, గంటా రమేష్, టి.ప్రేమ్‌కుమార్, కూనపోము రామ్మోహన్‌రావు, టి.వివేక్, బొమ్మ శ్రీనివాస్, జి.గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

గోబెల్స్ ప్రచారంలో చంద్రబాబు సిద్ధహస్తుడు

బుట్టాయగూడెం : గోబెల్స్ ప్రచారంలో చంద్రబాబు సిద్ధ హస్తుడని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం ఎదుట సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిమ్మిని బమ్మిని చేయడం, ఒక అబద్దాన్ని పదే పదే చెప్పి నిజంగా తీర్చిదిద్దడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రోజురోజుకూ వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజల నుంచి దూరం చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారని, అది సాధ్యం కాదని అన్నారు. చంద్రబాబు తీరును వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఎంతో విజయవంతంగా దూసుకుపోతుందని ఈ కార్యక్రమానికి ప్రజలు కోటి మందికి పైగా మద్దతు పలికారని అన్నారు. 70 లక్షల మందికి పైగా మిస్డ్ కాల్స్ ఇచ్చారని అన్నారు. ఈ నెల 29వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమం పూర్తి విజయవంతానికి సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలు సమన్వయంతో కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, తెల్లం సింహాచలం, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

మోదేలు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న రాఘువ

బుట్టాయగూడెం : మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న మోదేలు కొండరెడ్డి గిరిజన గ్రామానికి కరెంటు, రహదారి సౌకర్యం లేక ఆ గ్రామ గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రామనర్సయ్య భవనంలో మోదేలు గ్రామ గిరిజనులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరంలో ప్రభుత్వం గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సుమారు రూ. 70 లక్షల నిధులు కేటాయించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారని చెప్పారు. మోదేలు గ్రామం వేలేరుపాడు – బుట్టాయగూడెం మండలాల పరిధిలో ఉండడంతో రెండు మండలాలకు చెందిన ఫారెస్టు రేంజ్ అధికారులు సర్వే చేసి విద్యుత్ ఏర్పాటుకు కొన్ని చెట్లు తొలగించవలసి ఉంటుందని అందుకు అనుమతులు ఇవ్వమంటూ పనులు నిలుపుదల చేశారన్నారు. అయితే తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కోసం గిరిజనులు రహదారి వెంబడి కొన్ని చెట్లు నరకగా ఫారెస్టు అధికారులు 15 మంది గ్రామస్తులపై కేసులు పెట్టారని తెలిపారు. ఊరికి మంచి జరుగుతుందని గిరిజనులు చెట్లు నరికారని అలాంటి వారిపై కేసులు పెట్టడం తగదన్నారు. ప్రభుత్వం, అధికారులు కలుగజేసుకుని మోదేలు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని రాఘవ కోరారు. ఈ సమావేశంలో గ్రామ గిరిజనులు కెచ్చెల బాలరెడ్డి, కెచ్చెల తమ్మిరెడ్డి, కెచ్చెల రమేష్ రెడ్డి, గురుగుంట్ల గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌కు బ్రహ్మరథం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయంతో గెలవడం ఖాయమని ఎంపీపీ కోర్సా పోచమ్మ, మండల సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో తాము ఇంటింటికీ తిరుగుతున్న సమయంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలకు ప్రజాదరణ చాలా బాగుందని అన్నారు. మండలంలో దాదాపు 80 శాతం ఇంటింటికీ తిరిగి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను అతికించినట్లు తెలిపారు. మిగిలిన 20 శాతం కూడా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సున్నం సురేష్, పార్టీ నాయకులు చందా ప్రసాద్, కొప్పుల సత్యనారాయణ, ఉప్పల రాంపండు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కక్కిరాల చక్రి, కక్కిరాల రాము, గంగుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 10 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ రివ్యూ చేస్తున్నందున, ఆయా ఫిర్యాదుల విషయంలో అధికారులు స్పష్టతతో ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారం అయిన తరువాత వాటిని సవివరంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సోమవారం నాటి స్పందనలో 10 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్ : మండలంలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. పంచాయతీల పరిధిలో ఆయా ప్రాంతాల వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలియజేశారు. పోలవరం పంచాయతీ పరిధిలోని జగన్నాథపేట, కొత్తపేట ప్రాంతాల్లో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. కరపత్రాలను అందజేసి స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బండారు అప్పారావు, గృహసారథుల కన్వీనర్ ఎం.సాయిరామ్, పి.శ్యామ్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కొట్లాట కేసు నమోదు

పోలవరం రూరల్ : కొట్లాట ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. పోలవరం పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీకి చెందిన యర్రమళ్ల పోసిబాబు అనే వ్యక్తిని పాత గొడవల నేపథ్యంలో పాతనూతనగూడేనికి చెందిన ఎ.నారాయణరావు, మరో ముగ్గురు వ్యక్తులు కలిసి కొట్టారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన వై.సత్యన్నారాయణ సోమవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీ నూకాలమ్మ ఆలయానికి రూ. 25,116 విరాళం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ నూకాలమ్మ ఆలయ అభివృద్ధికి జంగారెడ్డిగూడెంకు చెందిన చప్పిడి శ్రీనివాసరావు, శివకుమారి దంపతులు రూ.25,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం : ట్రాక్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రైతు యలమాటి శ్రీధర్ కుటుంబానికి టొబాకో బోర్డు తరుపున సోమవారం అధికారులు ఆర్థిక సహాయం అందజేశారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కంద్రికగూడెం గ్రామానికి చెందిన యలమాటి శ్రీధర్ పొగాకు బేళ్లు తీసుకువస్తూ 23వ తేదీ రాత్రి కన్నాపురం సమీపంలోని పడమటి కాలువ వద్ద ట్రాక్టర్ తిరగబడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజమండ్రి ప్రాంతీయ రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలంకేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ బోర్డు ద్వారా మంజూరైన రూ. 20 వేలు మృతుడి భార్యకు అందజేశారు. మిగిలిన రూ.80 వేలు బోర్డు ఇన్సూరెన్స్ పథకం ద్వారా శ్రీధర్ కుటుంబానికి అందుతాయన్నారు. ముందుగా వేలం కేంద్రంలో శ్రీధర్ సంతాప సభ రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది ఆధ్వర్యంలో నిర్వహించారు.